సాక్షి నంద్యాల

శుక్రవారం ၊ 29 ၊ నవంబర్ ၊ 2024



శ్రీ మఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ మఠం భక్తులతో కిటకిటలాడింది. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనంకు, గ్రామ దేవత మంచాలమ్మకు పూజలు చేపట్టారు.



'నందీశ్వరుడి'కి ప్రదోషకాల పూజ

మహానంది: ఆలయంలోని నందీశ్వ రస్వామికి కార్తీకమాసం బహుళత్రయోదశి పురస్కరించుకుని గురువారం ప్రదోష కాలంలో అభిషేకాలు, షోడశోపచార పూజలు నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,629.97
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:93.932
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:3,033
అవుట్ ఫ్లో	:6,658

న్యూస్‌రీల్

తెలుగుగంగలో సాగు నీరు నిలిపివేత



రుద్రవరం: తెలుగుగంగ కాల్వల్లో సాగు నీటి విడుదలను నిలిపివేసినట్లు ఎస్ఈ సుబ్బరాయుడు గురువారం తెలిపారు. ప్రస్తుతం వరి, మొక్క జొన్న కోతలు సాగుతున్నాయని దీంతో నీరు వృథా గాకుండా, పంట కోత సమయంలో నీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకే వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద గేట్లను మూసివేసి సాగు నీటి విడుదలను నిలిపేశామన్నారు. మరో 15 రోజుల తర్వాత తిరిగి విడుదల చేస్తామన్నారు. గతంలో మాదిరిగానే వారబంది పద్ధతిలో తెలుగుగంగ సాగు నీటి విడుదల ఉంటుందన్నారు. కాగా సాగు నీరు విడుదలను నిలిపేయడంతో తెలుగుగంగ ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గింది.

30 నుంచి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రథమనందిలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 30 నుంచి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14 టేబుల్ టెన్నిస్ క్రీడలు నిర్వహించనున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30, వచ్చేనెల 1న రెండు రోజుల పాటు జరగనున్న క్రీడా పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 260 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. బాలికలకు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బాలురకు, మైనార్టీ సంక్షేమ హాస్టల్‌లో వసతి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీలో సభ్యుల నియామకానికి జిల్లా షెడ్యూల్ కులాలు, తెగల నాయకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికార అధికారిణి చింతామణి గురువారం ఒక ప్రకటనలో కోరారు. సమాజ సేవకులై ఉండాలని, జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో అవార్డులు, ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన వారికి ఎంపిక ప్రక్రియలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. సేవా పత్రాలను దరఖాస్తుకు జత చేసి డిసెంబర్ 7లోగా పొన్నాపురంలోని బసవతారక నగర్‌లో ఉన్న ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎంపికైన సభ్యుల పదవీ కాలం రెండేళ్లు ఉంటుందన్నారు. రెండు పర్యాయాలు కమిటీ సభ్యులుగా పని చేసిన వారు అనర్హులన్నారు.

మద్దిలేటయ్యకు రూ.23.77 లక్షల ఆదాయం



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్ర మద్దిలేటి నరసింహ స్వామికి రూ.23,77,889 ఆదాయం సమకూరింది. స్వామి, వార్లకు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలు, ముడుపులను గురువారం నిర్వహించారు. 30 రోజుల్లో భక్తులు రూ. 23,77,889 నగదు, 7.26 గ్రాముల బంగారు, 800.126 గ్రాముల వెండి సమర్పించినట్లు దేవదాయశాఖ అధికారి రమేష్, ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

నేటి నుంచి ఎంఎస్ఎంఈల సర్వే

నంద్యాల(అర్బన్): జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) సర్వే శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని జిల్లా పరిశ్రమల అధికారి జవహర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సర్వే నిర్వహిస్తారన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, పట్టణ స్థాయిలో కమిషనర్లు, జిల్లా స్థాయిలో పరిశ్రమల అధికారి నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరించనున్నారన్నారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన, మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తల నైపుణ్యాల అభివృద్ధి, ఇతర సేవలపై సర్వే ఉంటుందన్నారు.

పర్సనల్ రిక్వెస్ట్‌తో పరీక్షకు అనుమతి



శిరివెళ్ల మండలం గోవిందిన్నెకు చెందిన ఓర్వ కంటి ప్రకాశం జిల్లా ఒంగోలు ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఇతనికి ఈ ఏడాది రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.11 వేలు, విద్యా, వసతి దీవెన కింద రూ.20 వేలు ఇప్పటి వరకు అందలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. కళాశాల యాజమాన్యం మాత్రం ముందు ఫీజు చెల్లిస్తేనే సెమిస్టర్ పరీక్షలు, ప్రాక్టికల్స్‌కు హాల్ టికెట్ ఇస్తామని ఒత్తిడి చేశారు. 'కూలీపనులు చేసుకుంటూ తల్లిదండ్రులు చదివిస్తున్నారని, ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే అప్పు చేసైనా చెల్లిస్తానని పర్సనల్ రిక్వెస్ట్ చేసుకోవడంతో అనుమతించారు' అని విద్యార్థి కళ్యాణ్ తెలిపారు.

అప్పు చేసి ఫీజు కట్టి ..



చాగలమర్రికి చెందిన ముల్లా షేక్ ఖాజాఖిజెర్ అనంతపురంలోని శ్రీకృష్ణదేవ రాయ హార్టికల్చర్ సైన్స్ కళాశాలలో బీఎస్సీ హార్టికల్చర్ మూడో సంవత్సరం చదుతున్నాడు. ప్రైవేట్ కళాశాల కావడంతో సెమిస్టర్‌కు (ఆరు నెలలకు) ట్యూషన్, హాస్టల్ ఫీజు కలుపుకుని రూ.1.25 లక్షలు చెల్లిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మూడేళ్లు రూ.55 వేల ట్యూషన్ ఫీజుతోపాటు జగనన్న, విద్యాదీవెన కింద మరో రూ.20 వేలు వస్తుండటంతో అది పోనూ మిగతా రూ.55 వేలు చేతి నుంచి కట్టుకుని చదువుకుంటుండేవాడు. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి రూపాయి కూడా అందలేదు. అప్పు చేసి రూ.1.25 లక్షలు కట్టి సెమిస్టర్ ఫీజు చెల్లించాడు. ఇంతలోనే రెండో సెమిస్టర్ ఫీజు సమయం వచ్చింది. ఇప్పటి వరకు కట్టిన సెమిష్టర్ రీయింబర్స్‌మెంట్ మొత్తమే రాలేదు. అస్సలు ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందో రాదో కూడా తెలియని పరిస్థితి. 'మా నాన్న ఆదాయం కుటుంబ పోషణకే సరిపోతుంది. ఇంకా మూడు సెమిస్టర్ ఫీజు ఎలా చెల్లించాలో అర్థం కావడంలేదు. హార్టికల్చర్ సైంటిస్ట్ కావాలనే నా కల నెరవేరుతుందో లేదో' అని ఖాజాఖిజెర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

చదువులకు చంద్రగ్రహణం

- అందని వసతి, విద్యా దీవెన
- విడుదల కాని ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాల వేధింపులు
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు





తల్లికి వందనంపై స్పష్టత లేదు.. విద్యా, వసతి దీవెనల ఊసే లేదు.. ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌పైనా స్పష్టత కరువు.. ఇలాంటి దుస్థితిలో ఫీజుల భారంతో పేద, మధ్యతరగతి వర్గాలు అవస్థలు పడుతున్నాయి. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజు కోసం విద్యార్థులపై జులుం ప్రదర్శిస్తున్నాయి. ఇంజినీరింగ్, డిగ్రీ, విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఫీజులో కనీసం సగమన్నా చెల్లించాల్సిందే అని హుకుం జారీ చేస్తున్నారు. ఎన్నడూ లేనిది ఇప్పుడు ఒక్కసారిగా రూ.35 వేల నుంచి రూ.65 వేల వరకు చెల్లించాలంటే పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

నాడు

2019 లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చేసరికి రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సులకు రూ.8 వేల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండేది. దాన్ని కనిష్టంగా రూ.12,500, గరిష్టంగా రూ.18,500కు పెంచి నిధులు విడుదల చేశారు. ఈ నిధులతోపాటు 2017–18, 2018–19 విద్యా సంవత్సరాల్లోని రూ.వేల కోట్ల బకాయిలను సైతం విడుదల చేశారు.

నేడు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చంద్రబాబు ప్రభుత్వం గాలికొదిలేస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కూడా స్పష్టత ఇవ్వడం లేదు. గతంలో తమ ప్రభుత్వంలో మాదిరిగా అమలు చేస్తామని ఇటీవల మంత్రి లోకేష్ ప్రకటించడంతో కళాశాల యాజమాన్యాల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. గతంలో అంటే అప్పుడు ఇచ్చిన రూ.8 వేలు ఇస్తారా లేక జగన్ ప్రభుత్వం ఇచ్చిన విధంగా రూ.18,500 ఇస్తారా అనేదానిపై స్పష్టత లేక కళాశాల యాజమాన్యం ఆందోళన చెందుతోంది.

ఆళ్లగడ్డ: అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అందించే సంక్షేమ పథకాల పేర్లు మార్పు చేసిందే కాని వాటిని అమలును మాత్రం పూర్తిగా విస్మరించింది. ఫలితంగా ఐదేళ్లపాటు ప్రతి మూడు నెలలకోసారి (త్రైమాసికం) విడుదల చేస్తూ వచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ (ట్యూషన్ ఫీజు) చెల్లింపులు పూర్తిగా నిలిచి పోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మరో వైపు ఇంటికి దూరంగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో (వసతి దీవెన) హాస్టళ్లలో ఉంటూ ఉన్నత చదువులు చదువుకుంటున్న విద్యార్థుల కుటుంబాలపై ఒక్కసారిగా ఆర్థిక భారం పెరిగి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. అధికారంలోకి వస్తే అంతకుమించి ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు గద్దెనెక్కి దాదాపు 6 నెలలు అవుతున్నా అతీగతీ లేదు.

జగనన్న హయాంలో రూ.502 కోట్లు విడుదల

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ హయాంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ సామాజిక వర్గాల యువతీ, యువకులకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనల కింద సుమారు రూ.502 కోట్లు ఖర్చు చేసింది. క్రమతం తప్పకుండా తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో విద్యకు ఎలాంటి కష్టం లేకుండా సాగిపోయింది. ఈ ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు కావస్తున్నా ఫీజులపై స్పష్టత లేక పోవడంతో డిగ్రీ నుంచి పీజీ, ఇంజినీరింగ్, డాక్టర్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న లక్షలాది మంది యువతీ, యువకులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ వివరాలు

నియోజకవర్గం	విద్యార్థులు	పెండింగ్ మొత్తం (రూ.కోట్లలో)
ఆళ్లగడ్డ	4517	8.82
బనగానిపల్లె	5444	7.20
నంద్యాల	2517	4.89
డోన్	4006	7.99
శ్రీశైలం	4252	6.92
నందికొట్కూరు	3987	7.16
పాణ్యం	2824	1.76
	27547	729.82

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో ఫీజులు చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. ఫైనల్ ఇయర్ కావడంతో సెమిస్టర్ పరీక్షలకు ఇబ్బంది అవుతుందేమోనని ఆందోళనగా ఉంది. ప్రభుత్వం వెంటనే రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసి ఆదుకోవాలి

– కౌసల్య, డిగ్రీ ఫైనల్ ఇయర్, ఆళ్లగడ్డ

మా తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు



ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందనే నమ్మకంతోనే ప్రైవేటు కళాశాలలో చేరాను. ఈ ప్రభుత్వం ఇంత వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు. విద్యా, వసతి దీవెన కూడా జమ చేయలేదు. ఫీజు చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. ఈ విషయంలో మా తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలు చెల్లించాలి.

– జాస్మిన్, డిగ్రీ ఫైనల్ ఇయర్, రాంపల్లె

తిరుమల తరహాలో శ్రీశైల క్షేత్రం అభివృద్ధి

- మాస్టర్ ప్లాన్‌కు అవసరమయ్యే నివేదికలు ఇవ్వండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: తిరుమల క్షేత్రం తరహాలో శ్రీశైల మహా క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు సమగ్ర వివరాలతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన చాంబర్‌లో శ్రీశైల మహా క్షేత్ర అభివృద్ధిపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకరంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో శ్రీశైలం మహా క్షేత్రాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించి నివేదికలు పంపాలని గత సోమవారం ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన దేవదాయ, పర్యాటక, ఆర్‌అండ్‌బీ మంత్రుల కమిటీ సమావేశంలో నిర్దేశించారన్నారు. ఈ మేరకు జిల్లాలో శ్రీశైల మహా క్షేత్ర అభివృద్ధికి సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు అవసరమయ్యే నివేదికలను శుక్రవారం సాయంత్రంలోగా అందజేయాలన్నారు. రాబోయే రెండేళ్లలో శ్రీశైలం క్షేత్రాన్ని తిరుమల క్షేత్ర తరహాలో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, సంబంధిత అధికారులు సానుకూల దృక్పథంతో నివేదికలు తయారు చేసి ఇస్తే మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. గతంలో దేవదాయ, అటవీ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సర్వే నివేదికలను కూడా పొందుపరచాలన్నారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన అటవీ విస్తీర్ణం, అటవీ సరిహద్దుల సర్వే, గెజిట్ నోటిఫికేషన్, నందికొట్కూరు రిజర్వ్ ఫారెస్ట్, వన్య ప్రాణుల నిషేధిత భూములు సంబంధిత వివరాలతో నివేదికలు అందజేయాలన్నారు. శ్రీశైల దేవస్థానం ఆధీనంలో ఉన్న భూములు, అటవీ సరిహద్దుల నుంచి రక్షణ గోడలు, తిరుమల తరహాలో శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి సంబంధించిన నివేదికలను అందజేయాలని శ్రీశైలం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్‌కు సూచించారు. శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి గతంలో మంత్రుల కమిటీ సూచించిన అంశాలు, తయారు చేసిన నివేదికలను కూడా అందజేయాలన్నారు. సున్నిపెంట నుంచి శ్రీశైలం వరకు 2.5 కిలోమీటర్ల ఐకానిక్ బ్రిడ్జి ఏర్పాటు ప్రతిపాదనలు, రహదారి విస్తరణ పనులు మాస్టర్ ప్లాన్ నివేదికలో పొందుపరుస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, శ్రీశైలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్, ఆత్మకూరు డీఎఫ్ఓ సాయిబాబా, ఆత్మకూరు ఆర్‌డీఓ నాగజ్యోతి, సర్వే ల్యాండ్ ఏడీ జయరాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయండి

జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణాలను మరో నాలుగు వారాల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్‌పీసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీసీ రోడ్ల నిర్మాణ పనుల ప్రగతిపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1,026 సీసీ రోడ్ల నిర్మాణానికి గాను 255 రోడ్లు పూర్తయ్యాయని, మిగిలిన 771 సీసీ రోడ్ల లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. సిమెంట్, ఇసుక అందుబాటులో ఉండి చేయడానికి ఇబ్బంది ఏమిటని ఆమె ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. పూర్తయిన రోడ్లను 21 రోజులకు తక్కువ కాకుండా క్యూరింగ్ చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈలు నాగరాజు, రఘురామిరెడ్డి, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

రూ.135 కోట్లతో ఉపాధి పనులు

- డ్వామా పీడీ జనార్దన్‌రావు



పెద్ద యమ్మనూరు సమీపంలో డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

ఉయ్యాలవాడ: జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో వివిధ పనులకు రూ.135 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు డ్వామా పీడీ జనార్దన్‌రావు తెలిపారు. గురువారం మండలంలోని పెద్ద యమ్మనూరు, సర్వాయిపల్లె, ఇంజేడు గ్రామాల పరిధిలో జరుగుతున్న సిమెంట్ రోడ్లు, మినీ గోకుల నిర్మాణాలు, పండ్ల తోటలను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి పథకం కింద 76 లక్షల పనిదినాలకు గాను ఇప్పటి వరకు 67 లక్షల పనిదినాలు పూర్తయినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి వ్యవసాయ కూలీలు, మెటీరియల్‌కు రూ.38.37 కోట్లు నిధులు కేటాయించగా రూ.18.91 కోట్లు చెల్లించామన్నారు. జిల్లాలో రూ.85 కోట్లతో సీసీ రోడ్లు, రూ.12 కోట్లతో మినీ గోకులాల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. 1,026 సిమెంట్ నిర్మాణాలు లక్ష్యం కాగా 914 రోడ్ల నిర్మాణాలు మొదలయ్యాయన్నారు. 850 మినీ గోకులాలు మంజూరు కాగా 752 నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఉయ్యాలవాడ మండలంలో సర్వాయిపల్లె గ్రామంలో గోకులం షెడ్డు నిర్మాణం పూర్తి కావడంతో పరిశీలించారు. ప్రతి గ్రామంలో రోజూ 50 మంది కూలీలకు తగ్గకుడా పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద యమ్మనూరులో గాండ్ల సుధాకర్ సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలించారు. మిగతా రైతులు పండ్లతోటల సాగుకు ముందుకు రావాలని ఉపాధిహామీ ద్వారా 100 శాతం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాశ్, ఈసీ షరీఫ్‌బాషా, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇసుక మాయం?

- ఆళ్లగడ్డలో సీజ్ చేసిన 164 టన్నుల ఇసుక తరలింపు
- జేసీబీల సాయంతో రాత్రికి రాత్రే ఇసుకను తరలించిన టీడీపీ మండల కన్వీనర్

సాక్షి, నంద్యాల: కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి ఇసుక లభ్యత గగనమైంది. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో ఇదే అదునుగా అధికార పార్టీ నాయకులు అక్రమంగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆళ్లగడ్డలో రెండు నెలల కింద ప్రభుత్వ అవసరాల కోసం నిల్వ ఉంచిన 660 మెట్రిక్ టన్నుల ఇసుకను స్థానిక ప్రజాప్రతినిధి అనుచరులు కొల్లగొట్టారు. ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుకను మాయం చేశారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఇసుకను అధికారులు రికవరీ చేయలేదు. ఖాళీ అయిన ఇసుక విలువను కూడా రాబట్టలేకపోయారు. ఈ ఘటన మరువకముందే సీజ్ చేసి ఆళ్లగడ్డ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిల్వ ఉంచిన ఇసుక మాయమైంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు అప్పుడప్పుడు దాడులు చేసి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను సీజ్ చేస్తూ వచ్చారు. రెండు, మూడు నెలల్లో ఇలా సీజ్ చేసిన ఇసుక 164 టన్నులకు చేరింది. అయితే ఈ ఇసుకను రెండు రోజులుగా అర్ధరాత్రి దాటిన తర్వాత జేసీబీల సాయంతో తరలిస్తూ ఖాళీ చేసేశారు. స్థానిక టీడీపీ కన్వీనర్ ఒకరు ఈ ఇసుకను తరలించినట్లు సమాచారం. ఇదే విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ అవసరాల కోసమే ఇసుకను తరలించామన్నారు. అధికారిక ఉత్తర్వులున్న నేపథ్యంలో దొంగ చాటుగా అర్ధరాత్రి సమయంలో ఇసుకను తరలించాల్సిన అవసరం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

'మేమేం చేశాం'

- స్పాట్ వాల్యుయేషన్ జీతం సగం మందికి పెండింగ్

సాక్షి, నంద్యాల: ఇంటర్మీడియెట్ ప్రశ్న పత్రాల మూల్యాంకనం చేసిన కొందరు ప్రైవేట్, కాంట్రాక్ట్ లెక్చరర్లకు నేటికీ వేతనం చెల్లించకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరికి చెల్లించి.. కొందరికి చెల్లించకపోవడంతో తామేమి పాపం చేశామని బాధితులు ప్రశ్నిస్తున్నారు. మార్చి చివరలో మూల్యాంకనం పూర్తయింది. వారం లోపు ఫలితాలు విడుదలయ్యాయి. అదే సమయంలో ఎన్నికల నోటిఫకేషన్ రావడంతో అప్పటి ప్రభుత్వం మూల్యాంకనం చేసిన లెక్చరర్లకు వేతనం ఇవ్వలేకపోయింది. అయితే జూన్ 4న కోడ్ ముగిసిన తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వేతనం బిల్లులను వెంటనే ప్రాసెస్ చేయాల్సి ఉన్నా జాప్యం చేస్తూ వచ్చింది. ఇదే విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఇటీవల సగం మందికి (రూ.8 లక్షలు) వారి ఖాతాల్లో జమ చేసింది. ఇంకా సగం మందికి (దాదాపు రూ.7 లక్షలు) పెండింగ్ పెట్టింది. దీంతో తామేమి పాపం చేశామని వేతనం అందని ప్రైవేట్, కాంట్రాక్ట్ లెక్చరర్లు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఏడు నెలలైందని ఇకనైనా తమకు రావాల్సిన వేతనం ఇవ్వాలని కోరుతున్నారు.

మెడికల్ కాలేజీలో పోస్టుల భర్తీకి అనుమతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించిన ఫేజ్ 1, 2, 3 నోటిఫికేషన్లలో ఆదోని మెడికల్ కాలేజీ పోస్టులను మినహాయించి మిగిలిన 282 పోస్టులను భర్తీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మెరిట్ లిస్ట్, రోస్టర్ ఆధారంగా నిబంధనల మేరకు భర్తీ ప్రక్రియ చేపడతామని తెలిపారు.

'రైతు భరోసా రైతులకు ఇవ్వడం దండగ'

- తిని, తాగి రైతులు సోమరిపోతులయ్యారు
- ఖద్దరు బట్టలు వేసుకొని జల్సాగా తిరుగుతున్నారు
- మండల సర్వసభ్య సమావేశంలో గుమ్మకొండ సర్పంచ్ వివాదాస్పద వ్యాఖ్యలు



మాట్లాడుతున్న సర్పంచ్ దశరథరామిరెడ్డి

డోన్: రాష్ట్రంలో రైతాంగం పండించే పంటలకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు కల్పించకుండా రైతుభరోసా లాంటి తాయిలాలు ఎరవేసి తాగుబోతులుగా మార్చాయని డోన్ మండలం గుమ్మకొండ గ్రామ సర్పంచ్ దశరథ రామిరెడ్డి ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కింద డబ్బు ఇస్తే వారు తిని, తాగి రోజూ తెల్లబట్టలు వేసుకొని తిరుగుతున్నారనడంతో అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అవాక్కయ్యారు. అంతటితో ఆగకుండా ఆయన రెవెన్యూ అధికారులు ముఖ్యంగా వీఆర్‌ఓల అవినీతి, అక్రమాలపైనా ఆరోపణలు గుప్పించారు. కష్టించి పనిచేసే రైతులకు ఎవరి దయా దాక్షిణ్యాలు అవసరం లేదని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తే చాలని చెప్పుకొచ్చారు. రైతులను తాగుబోతులుగా సాక్షాత్తూ మండల సర్వసభ్య సమావేశంలో పేర్కొన్న సర్పంచ్ దశరథ రామిరెడ్డి వైఖరి పట్ల రైతులు మండిపడుతున్నారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉర్దూ యూనివర్సిటీలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ సెట్‌లో అర్హత సాధించని, పీజీ సెట్ 2024 పరీక్షకు హాజరు కాని అర్హత గల అభ్యర్థులతో స్పాట్ అడ్మిషన్స్ కింద సీట్లను భర్తీ చేసుకునేందుకు అనుమతిస్తూ జీవో నెంబర్ 172ను రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులను జారీ చేసినట్లు తెలిపారు. పీజీ కోర్సుల్లో పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్న ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ ఉర్దూ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ బాటనీ, ఎమ్మెస్సీ జువాలజీ, ఎమ్మెస్సీ ఇండస్ట్రియల్ కెమిస్ట్రీలో అర్హత గల విద్యార్థులు స్పాట్ అడ్మిషన్స్ కింద అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈనెల 29వ తేదీ వర్సిటీ కార్యాలయంలో హాజరై ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ల కింద అడ్మిషన్ పొందిన వారు ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయానికి అర్హులు కారని తెలిపారు. వివరాలకు 83415 11632, 99597 58609 ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

కేసీకి 2,400 క్యూసెక్కుల నీటి సరఫరా



కేసీ కాల్వలో ప్రవహిస్తున్న నీరు

జూపాడుబంగ్లా: సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. డ్యాంలో 1.2 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు చెప్పారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,249 క్యూసెక్కుల సాగునీరు చేరుతుండగా అందులో నిప్పులవాగుకు 624 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 420 క్యూసెక్కులు, 205 క్యూసెక్కుల చొప్పున సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ వివరించారు. ఇదిలాఉండగా డిసెంబర్ 8న సాగునీటి సలహా సంఘాల ఎన్నికలు రెవెన్యూ అధికారుల సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



హిమాయత్ (ఫైల్)

బేతంచెర్ల: పట్టణంలోని కొత్త బస్టాండు కాలనీ సమీపంలో నివాసం ఉంటున్న మహమ్మద్ రఫీ కుమారుడు హిమాయత్ (29) గురువారం ఉదయం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 25వ తేదీన అదృశ్యమైన హిమాయత్ గురువారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చాడు. రెండున్నర సంవత్సరాల క్రితం భార్య కుబ్రా మరణించడంతో పాటు నాపరాయి పరిశ్రమలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని చనిపోయాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి మహమ్మద్ రఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప వెల్లడించారు.

కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి



మృతిచెందిన జీవాలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు గ్రామంలో బుధవారం రాత్రి కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి చెందాయి. గ్రామ సమీపాన పొలంలో గొర్రెల మందను నిలపగా వీధికుక్కలు దాడిచేసి జీవాలను పొట్టన బెట్టుకున్నాయని యాజమాని కురువ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన జీవాల ఖరీదు రూ.2 లక్షలు ఉంటుందని వాపోయారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఉమ్మడి జిల్లా గొర్రెల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు బాధితునికి ధైర్యం చెప్పి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

ఊబకాయం.. వ్యాధులకు మూలం

- అధిక బరువుతో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు
- పట్టణాల్లో 20 శాతం మందికి బీపీ, షుగర్, గుండె సమస్యలు
- నిర్లక్ష్యం చేస్తే క్యాన్సర్ వస్తుందంటున్న వైద్యులు
- ఎక్కువసేపు కూర్చుని పనిచేయడమే కారణం
- వ్యాయామం అస్సలు చేయకపోవడంతో సమస్యలు
- పిల్లలనూ వేధిస్తున్న సమస్య
- చురుకుగా లేక చదువులో వెనుకబాటు

ఇటీవల ఎక్కడ చూసినా పది మందిలో నలుగురు స్థూలకాయులుగా కనిపిస్తున్నారు. జీవనశైలిలో వస్తున్న మార్పులు, ఒకేచోట గంటల తరబడి కూర్చుని పనిచేయడం, శారీరక శ్రమ అస్సలు లేకపోవడం, ఆహారంలో కొవ్వు, తీపి, నూనె పదార్థాలు ఎక్కువకావడం వల్ల ఊబకాయులు పెరిగిపోతున్నారు. నోటికి రుచిగా తగులుతుందని అతిగా ఆహారం తినడం, దానిని అరిగించడానికి తగిన శ్రమ చేయకపోవడంతో చాలా మంది శరీరంలో కొవ్వు శాతం పెరిగిపోతోంది. ఈ కారణంగా బరువుతో పాటు ఒంట్లో రోగాల సంఖ్య కూడా అధికమవుతోంది. వ్యాధులు తగ్గించుకునేందుకు వైద్యుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.



కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఊబకాయుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇంట్లో ఆహారానికి బదులు బయటి ఆహారానికే మక్కువ చూపడం, వాటిలో కొవ్వు శాతం అధికంగా ఉండటం కారణంగా వైద్యులు పేర్కొంటున్నారు. జిల్లాలో ఫాస్ట్‌ఫుడ్‌తో పాటు రోడ్ల పక్కన తోపుడు బండ్లపై బజ్జీలు, పానీపూరీలు, కూల్‌డ్రింక్‌లు, మొబైల్ క్యాంటీన్లలో టిఫిన్ల వ్యాపారం రోజుకు రూ.4 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇలాంటి వ్యాపారాలు ఇటీవల కాలంలో కర్నూలు నగరంతో పాటు కోడుమూరు, పత్తికొండ, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు వంటి చోట్ల ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు మండల కేంద్రాల్లో కేవలం సాంప్రదాయ చిరుతిండ్లు మాత్రమే లభించేవి. ఇప్పుడు అక్కడ కూడా ఫాస్ట్‌ఫుడ్‌లు, పానీపూరీ బండ్లు ఆక్రమించాయి. ఇవి శరీరంలో బరువు పెంచడమే కాదు హార్మోన్ల సమతుల్యతనూ దెబ్బతీస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఫలితంగా థైరాయిడ్, గర్భాశయంలో నీటితిత్తులు వంటి సమస్యలు పెరిగి సంతాన భాగ్యానికి అడ్డుకట్ట వేస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. మరోవైపు చిన్నతనం నుంచే ఫాస్ట్‌ఫుడ్‌లు, బేకరి, జంక్‌ఫుడ్‌లకు అలవాటు పడటం, ఆటలు లేకపోవడం వల్ల పిల్లలు కూడా ఊబకాయులుగా మారుతున్నారు. పెద్దల్లో 15 శాతం, పిల్లల్లో 5 శాతం స్థూలకాయులు ఉన్నట్లు అంచనా.

కొంపముంచుతున్న డోర్ డెలివరీలు

కోవిడ్ సమయం నుంచి డోర్ డెలివరీ సంస్కృతి పెరిగిపోయింది. బద్ధకమో, సమయం లేకనో పలువురు ఆహారాన్ని ఆర్డర్ పెట్టి తెప్పించుకుంటున్నారు. ఇలా తెప్పించుకున్న ఆహారంలో బిర్యానీలదే అగ్రస్థానం. డోర్‌డెలివరీ ఆహారంలో 80 శాతం మాంసాహారం ఉండగా, 20 శాతం మాత్రమే శాఖాహారం ఉంటోంది. మనిషి తీసుకునే ఆహారంలోని క్యాలరీలకు, ఖర్చయ్యే క్యాలరీలకు పొంతన ఉండటం లేదు. ఈ ప్రభావంతో శరీరంలో కొలెస్ట్రాల్ పెరుగుతోంది. ఇది దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, గుండెజబ్బులు, మానసిక ఒత్తిళ్లు, క్యాన్సర్‌కు దారితీస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కార్బొహైడ్రేట్లు అధికంగా ఉన్న ఆహారాన్ని తినడం, శ్రమ లేకుండా వెంటనే నిద్రించడం వల్ల క్రమేపీ ఊబకాయులుగా మారిపోతున్నారు.

ఊబకాయమొస్తే ఇవీ సమస్యలు

- ఊబకాయం వల్ల శరీరం చలాకీతనం కోల్పోతుంది. ఫలితంగా పనిలో వృద్ధి కనబరచలేరు. పిల్లలు చదువులో వెనుకబడిపోతారు.
- బీపీ, షుగర్, గుండెజబ్బులు, మానసిక ఒత్తిడి వచ్చే ప్రమాదం ఉంది.
- చర్మ, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు పెరిగే అవకాశం ఉంది.
- మానసిక కుంగుబాటుకు గురయ్యే ప్రమాదం ఉంది.

ఎలాంటి ఆహారం తీసుకోవాలంటే...

- ఆహారంలో కార్బొహైడ్రేట్లు తక్కువగా, ప్రొటీన్లు, మినరల్స్, ఫైబర్ (పీచు పదార్థాలు) ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- కోడిగుడ్లు, కంది, పెసర తదితర పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, ఆహారంలో చేర్చాలి.
- యాపిల్, జామ, కివీ, పైనాపిల్, బొప్పాయి, ఖర్జూరాలు, డ్రైఫ్రూట్స్ వంటివి తీసుకోవాలి.
- అధిక పిండి పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం తగ్గించాలి.
- మాంసాహారాన్ని మితంగా తినాలి. ఎక్కువగా శాఖాహారమే భుజించాలి.
- జంక్‌ఫుడ్‌ను వీలైనంత మేరకు తగ్గించాలి.
- ప్రతిరోజూ గంటపాటు వ్యాయామం, నడక, యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి చేస్తూ ఉండాలి.
- ఎత్తు, బరువు, వయసు ఆధారంగా మంచినీటిని తాగాలి.

అధిక బరువుతో కీళ్ల సమస్యలు



అధిక బరువు సమస్యతో చాలా మందిలో కీళ్ల సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ (కీళ్లవాతం)తో పాటు మోకాళ్ల నొప్పులు, తుంటి సమస్యలు వేధిస్తున్నాయి. ఈ మేరకు మా వద్దకు చికిత్సకు వచ్చే వారిలో ఎక్కువ మంది అధిక బరువుతో సమస్యలు ఎదుర్కొంటున్న వారే ఉంటున్నారు. ఉండాల్సిన బరువు కన్నా ఎక్కువ ఉన్న బరువును తగ్గించుకుంటే కీళ్ల నొప్పులు కూడా తగ్గే అవకాశం ఉంది. కీళ్లవాతం సమస్య కూడా అదుపులోకి వస్తుంది.

– డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యుడు, కర్నూలు

స్థూలకాయంతో బీపీ, షుగర్ జబ్బులు



ప్రస్తుత కాలంలో చాలా మంది స్థూలకాయంతో బాధపడుతున్నారు. ఈ కారణంగా బీపీ, షుగర్ వంటి వ్యాధులు చిన్న వయస్సులోనే వారిని వేధిస్తున్నాయి. మా వద్దకు చికిత్సకు వచ్చే వారిలో ఇలాంటి వారే ఎక్కువగా ఉంటున్నారు. అధికంగా ఉన్న శరీర బరువును తగ్గించుకుంటే బీపీ, షుగర్ వ్యాధులూ నియంత్రణలోకి వస్తాయి. ఈ మేరకు ప్రతిరోజూ అరగంట నుంచి గంట పాటు వ్యాయామం చేయాలి. ఇందుకోసం నడక, జిమ్, యోగాసనాలు ఎంతో ఉపయోగపడతాయి. ఆహారంలో కొవ్వును పెంచే పదార్థాలకు దూరంగా ఉండాలి.

– డాక్టర్ రంగనాథ్, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

కూటమి పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం



అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య, పార్టీ శ్రేణులు

కల్లూరు: రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. గురువారం జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లోని జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాట్లాడే హక్కును హరించే విధంగా రెడ్‌బుక్ పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వ పాలనలోని తప్పిదాలను సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న వారిపై కేసులు నమోదు చేయడాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. ప్రశ్నించిన వారిపై వేర్వేరు ప్రాంతాల్లో కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని ప్రజలు అడగుతారని సోషల్ మీడియా పోస్టులపై చర్యలు తీసుకుంటూ డైవర్ట్ చేస్తున్నారని చెప్పారు. చట్టం అందరికీ సమానంగా పని చేయాలని, కేవలం కూటమి నేతల ఫిర్యాదు మేరకు సోషల్ మీడియా వారిపై కేసు నమోదు చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులపై అభ్యంతరకరంగా పోస్టులు పెట్టిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

సంక్షేమ పథకాల క్యాలెండర్ ఘనత వైఎస్సార్‌సీపీదే

రాష్ట్రంలో అర్హులైన ప్రజలందరికీ ఏ సమయంలో ఏయే పథకాలు అమలు చేస్తామో ముందుగానే క్యాలెండర్ తేదీలను ప్రకటించి అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. కూటమి పాలనలో ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో కొన్ని కళాశాలలు వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు, కోర్సులు పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. కూటమి పార్టీల నాయకులు గ్రావెల్, ఇసుక వంటి వాటిలో వాటాల కోసం పోట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కృష్ణానగర్‌లో ఐటీసీ సర్కిల్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కోసం జిల్లా ఉన్నతాధికారుల అనుమతితో జగన్నాథగట్టు నుంచి ఎర్రమట్టి తీసుకున్నామని, దీనిపై గ్రావెల్ అమ్ముకుంటున్నారని కూటమి పార్టీల నాయకులు అసత్య ప్రచారం చేయడం తగదన్నారు.

మహనీయుల స్ఫూర్తితో జగనన్న పాలన

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, మహాత్మాగాంధీ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని పాలన సాగించారని మేయర్ బీవై రామయ్య అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పాలన సాగిస్తోందన్నారు. ప్రతి నెలా ఒక సంక్షేమ పథకాన్ని అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం కుటుంబాలు, పాఠశాలలు, దేవాలయాలకు సమీపంలో మద్యం షాపులు ప్రారంభించడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు చిట్టెమ్మ, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శ్వేతారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, నరసింహులు, నాయకులు జయన్న, శివారెడ్డి, హుస్సేన్ ఆలం, తిరుమలేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం చిన్నబోయేలా..!



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఏడీ, డీఎస్‌డీఓలు



డిస్కస్ త్రోలో ప్రతిభ చాటుతున్న దివ్యాంగుడు

కర్నూలు (టౌన్): విభిన్న ప్రతిభావంతులు క్రీడల్లో రాణించడం శుభపరిణామమని, వారిలో మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ప్రభుత్వం ఈ క్రీడలను నిర్వహిస్తోందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు వెల్లడించారు. 65వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను అతిథులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది విభిన్న ప్రతిభావంతులు అథ్లెటిక్స్ వంటి పోటీల్లో తలపడుతున్నారన్నారు. హాజరైన ప్రతి దివ్యాంగుడు క్రీడా పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని పిలుపునిచ్చారు. డిసేబుల్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, పీఈటీలు, స్పోర్ట్స్ అథారిటీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు ఎంత కష్టం



రూపనగుడి సమీపంలో మిర్చి పైరును దున్నేస్తున్న రైతు తిరుమలేశ్వర రెడ్డి

ఉయ్యాలవాడ: లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన సాగుచేసిన పంటను రైతే స్వయంగా ట్రాక్టర్‌తో దున్నేశాడు. వివరాలు.. ఉయ్యాలవాడ మండలం తుడమలదిన్నెకు చెందిన కౌలు రైతు కర్నాటి తిరుమలేశ్వరరెడ్డి రూపనగుడి గ్రామ సమీపంలో 29 ఎకరాలు మిరప పంట సాగు చేశాడు. ఎకరానికి రూ.53 వేలు ప్రకారం కౌలు చెల్లించడంతో పాటు రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, ఇతర పెట్టుబడుల రూపంలో ఇప్పటికే ఎకరాకు రూ.2 లక్షల చొప్పున ఖర్చుచేశాడు. గత అక్టోబర్, నవంబర్ ప్రారంభంలో తుపాన్ల కారణంగా ఎడతెరపి లేని వర్షాలతో పైరుకు తెగులు సోకింది. పలు దఫాలు మందులు పిచికారీ చేసినా తెగులు అదుపులోకి రాకపోవడంతో గురువారం 6 ఎకరాల మిరప పంటను రోటావేటర్‌తో దున్నేశాడు. అలాగే మండల పరిధిలో ఉయ్యాలవాడ, అల్లూరు, సుద్దమల్ల, మాయలూరు, హరివరం, బోడెమ్మనూరు, ఇంజేడు, తదితర గ్రామాల్లో రైతులు 720 హెక్టార్లలో మిరప సాగు చేశారు. పైరుకు పచ్చదోమ, తెల్లదోమ, బింగి తెగులు సోకి ఆకులు ముడత పడి మొక్కల ఎదుగుదల నిలిచిపోయింది. ఇప్పటికే పెట్టుబడులు, ముందస్తు కౌలు చెల్లింపునకు లక్షలాది రూపాయలు ఖర్చు చేశామని, కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని మిర్చి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాతీయ సైన్స్ సాహిత్య సదస్సుకు ఎంపిక



ఉపాధ్యాయుడు కుమార్‌బాబు

బనగానపల్లె రూరల్: జాతీయ సైన్స్ సాహిత్య సదస్సుకు మండలంలోని ఇల్లూరుకొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వీరబోయిన కుమార్ బాబు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ.. ఈ నెల 30 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు అస్సాం రాష్ట్రం గౌహతి ఐఐటీలో భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ నిర్వహించే జాతీయ సైన్స్, కళా సాహిత్య సదస్సులో పాల్గొంటున్నట్లు చెప్పారు. సదస్సుకు దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి సైన్స్ కథ రచయితలను ఎంపిక చేశారని, రాష్ట్రం నుంచి ఎంపికైన ఇద్దరిలో తనకు అవకావం దక్కిందని పేర్కొన్నారు. సదస్సులో ప్రపంచ మేటి శాస్త్రవేత్తలు, నోబుల్ బహుమతి గ్రహీతలతో పాటు ప్రధాని నరేంద్రమోదీ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్‌బాబును తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయస్థాయి విజేతలుగా తిరిగిరావాలి



రాష్ట్రస్థాయి విజేతలతో డీఈఓ జనార్దన్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): అండర్-19 ఫెన్సింగ్ క్రీడల్లో ఏపీ జట్టు జాతీయస్థాయిలో విజేతగా నిలవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి క్రీడలు విజయవంతంగా ముగిశాయి. ముఖ్యఅతిథులుగా డీఈఓ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ హర్షవర్ధన్, జిల్లా ఉర్దూ డీఐ అస్మోద్దీన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. అండర్-19 ఫెన్సింగ్ పోటీలు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో డిసెంబర్ 17 నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయన్నారు. జాతీయస్థాయి పోటీల్లో ఏపీ క్రీడాకారులు చక్కని ప్రతిభ కనబరిచి విజేతలుగా తిరిగి రావాలన్నారు. అనంతరం ఇప్పి, షాబార్, ఫాయిల్ విభాగాల్లో టీమ్ ఇవెంట్లలో, వ్యక్తిగత ఈవెంట్లలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనాథ్, క్రీడాభివృద్ధి అధికారి రాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు దండె నాగరాజు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ స్థలాన్ని ఆక్రమిస్తే ఊరుకోం



ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ స్థలాన్ని ఆక్రమించాలని చూస్తే ఊరుకోబోమని జూనియర్ డాక్టర్లు స్పష్టం చేశారు. వారు గురువారం కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్, డీఆర్‌ఓలకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్నాయని కాలేజీ బయట ఉన్న షాపులను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారని, అయితే కళాశాల గేటు వద్ద ఉన్న 7 సెంట్ల స్థలాన్ని ఇవ్వాలని కోరడం దారుణమన్నారు. ఈ స్థలంలో దుకాణాలు నిర్మించడం వల్ల కళాశాలలో వైద్యులు, విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. జూడాల ఆందోళనకు ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ, కోశాధికారి డాక్టర్ దమామ్ శ్రీనివాసులు మద్దతు తెలిపారు. జూడాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జగదీష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతలను సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీతత్వమసి అయ్యప్ప స్వామి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి పట్టణానికి చెందిన కటారుకొండ జనార్దన్‌శెట్టి, లక్ష్మీ దంపతులు రూ.1,01,116 విరాళం అందజేశారు. గురువారం ఆలయానికి వెళ్లి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజల అనంతరం కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. కమిటీ సభ్యులు దాతలను స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించారు. దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కొలిమిగుండ్ల: మండలంలోని పెట్నికోటలో అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని సీఐ రమేష్‌బాబు స్వాధీనం చేసుకున్నారు. అవుకు మండలం కొండమనాయినపల్లెకు చెందిన గోపాలకృష్ణ గురువారం బొలేరో వాహనంలో 35 ప్యాకెట్లు (1400 కేజీలు) రేషన్ బియ్యాన్ని అనంతపురం జిల్లా యాడికి చెందిన బాలు అనే వ్యక్తికి అప్పగించేందుకు తీసుకెళ్తున్నాడు. పెట్నికోటలోని గొర్విమానుపల్లె రస్తాలో చిన్న కనుమకట్ట వద్ద పోలీసులు వాహన తనిఖీ చేయడంతో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

కరాటేలో బంగారు పతకాలు



విజేతలను అభినందిస్తున్న డీఈఓ శామ్యూల్ పాల్

కర్నూలు (టౌన్): అనంతపురం పట్టణంలో ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కర్నూలు క్రీడాకారులు 12 బంగారు పతకాలు సాధించారు. అండర్-14 విభాగంలో మహమ్మద్ గౌస్, మహేష్, హనీఫ్, హృషికేష్, హేమంత్, చైతన్య లక్ష్మీ, ఎస్మిత, కావ్య, స్వాతి రెడ్డి అలాగే అండర్-17 విభాగంలో ఎం.వి.శ్రీదినేష్, బి.సాయి అక్షిత, ఎస్.సాకీయ పతకాలతో సత్తా చాటారు. ఆ క్రీడాకారులను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్‌పాల్ తన చాంబర్‌లో అభినందించారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య, పరమేష్ పాల్గొన్నారు.

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): బహిరంగ ప్రదేశాలలో ప్రజల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి గురువారం జైలు శిక్ష ఖరారు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వివరాల మేరకు పట్టణంలోని పానిపట్టి వీధికి చెందిన పఠాన్ ఖలీల్‌ఖాన్ రోడ్డున పోయే ప్రజల పట్ల అసభ్యకరంగా సైగలు చేస్తూ ఈలలు వేస్తూ భయపెడుతూ, న్యూసెన్స్ చేస్తూ ప్రజాశాంతికి భంగం కలిగించేవాడని, స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒకరోజు జైలుశిక్షను ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతిభకు పరీక్ష



ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పరిశీలనతో పాటు ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పెర్ఫార్మెన్స్ అసెస్మెంట్ రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ (పరఖ్ సర్వేక్షణ-2024) పేరుతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు సంబంధించిన సామర్థ్య పరీక్షను డిసెంబర్ 4న జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహించనున్నారు.

ఒక్కో పాఠశాల నుంచి

నంద్యాల జిల్లాలోని 137 పాఠశాలలను ఈ పరీక్ష కోసం ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాల నుంచి తరగతికి 30 మంది చొప్పున 3, 6, 9 తరగతుల విద్యార్థులను ఎంపిక చేస్తారు. జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లాస్థాయి కో-ఆర్డినేటర్‌గా, డీసీఈబీ సెక్రటరీ సహాయ జిల్లాస్థాయి కో-ఆర్డినేటర్‌గా వ్యవహస్తారు. పరీక్షను పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది.

పరీక్షలు ఇలా..

ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించే పరఖ్ పరీక్షకు ముందుగా ప్రాక్టీస్ పేపర్ల ద్వారా తర్ఫీదు ఇస్తారు. ఇందులో 3, 6 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ గణితం, సోషల్, సైన్సు సబ్జెక్టులపై పరీక్షలు ఉంటాయి. 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్‌లో 45 ప్రశ్నలతో 90 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతి సిలబస్‌లో 51 ప్రశ్నలతో 90 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌లో 60 ప్రశ్నలతో 120 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. ఓఎంఆర్ షీటు విధానంలో పరీక్ష ఉంటుంది. ఇప్పటికే పరఖ్ పరీక్ష కోసం ఎంపిక చేసిన 151 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు, అబ్జర్వర్లు, మండల విద్యాశాఖ అధికారులకు శిక్షణ కార్యక్రమం నంద్యాల, డోన్ డీసీఈబీలో నిర్వహించారు.

పరఖ్ పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులు

తరగతి	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
3వ	51	1058
6వ	38	1016
9వ	48	1328
మొత్తం	137	3396